

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

చాదర్‌ఘాట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 83మంది లబ్ధిదారులకు బుధవారం కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అహ్మద్ బలాల పంపిణీ చేశారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంజూరైన చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే సాంబశివరావు, సీపీఐ నేతలు

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సీపీఐ నేతలు

- కుంట్లూర్ భూదాన్‌లో గుడిసెవాసులకు న్యాయం చేయాలని వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం కలిశారు. ఈ మేరకు కుంట్లూర్ భూదాన్ భూమిలో గుడిసెవాసులకు న్యాయం చేయాలని కోరుతూ సీఎంకు వినతి పత్రం సమర్పించారు. కుంట్లూర్ రెవెన్యూ సర్వే నంబర్ 215 నుంచి 224లో 20నెలల క్రితం సుమారు 20వేల మంది ఇళ్లులేని పేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. విలువైన భూదాన భూమిని కబ్జా చేసేందుకు కొందరు భూస్వాములు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుమ్మక్కయ్యారని పేర్కొన్నారు. వారి నుంచి భూమి రక్షించాలని కోరారు. అదే స్థలంలో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలను ఇచ్చి.. గృహలక్ష్మి పథకంలో ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. సదరు భూమిపై నెలకొన్న లీగల్ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్రచారి, పాలమాకుల జంగయ్య, ముత్యాల యాదిరెడ్డి, పానుగంటి పర్వతాలు పాల్గొన్నారు.

ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



హోమియో ఆస్పత్రిని శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): హోమియో ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని హోమియో ఆస్పత్రి పరిసరాలు చెట్లు, చెత్త, చెదారాలతో దుర్గంధం వస్తుందని ఆస్పత్రి సిబ్బంది బుధవారం కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. తక్షణమే స్పందించిన కార్పొరేటర్ సంబంధిత సిబ్బందితో ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న చెట్లు, ఇతర వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టారు. కార్యక్రమంలో వైద్యురాలు నర్మద, ఏఈ నరేంద్రతేజ, అజీమ్, జవాన్ రాంచందర్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు

త్వరితగతిన రోడ్డు పనులు చేపట్టాలి

వనస్థలిపురం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో చేపట్టబోయే రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకరావాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాగార్జున కాలనీలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ ప్రజ్ఞ, నాగార్జున కాలనీ అధ్యక్షుడు లట్టుపల్లి మోహన్‌రెడ్డి, కార్యదర్శి హన్మంత్‌రెడ్డి, కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

నేటి యువత క్రీడల్లో రాణించాలి: కార్పొరేటర్



క్రీడాకారుడు శివాజీగౌడ్‌కు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నేటి యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కటికోనికుంటకు చెందిన క్రీడాకారుడు శివాజీగౌడ్‌కు బుధవారం కార్పొరేటర్ క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్ఎస్‌సీ హైదరాబాద్ పీర్జాదీగూడ వారు నిర్వహించిన అండర్-19 క్రికెట్ పోటీల్లో శివాజీగౌడ్ ఉత్తమ ప్రతిభ కనబరచడం, ఎన్ఎస్‌సీ క్రికెట్ జట్టుకు శివాజీగౌడ్ ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. యువత క్రీడల్లో ముందుండాలని, రాష్ట్రంతో పాటు దేశానికి మంచిపేరు తీసుకరావాలని కార్పొరేటర్ కోరారు.

మీర్‌పేట్ పీఎస్‌కు నలుగురు కొత్త ఎస్ఐలు

సరూర్‌నగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్‌లోని మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా నలుగురు ఎస్ఐలు బదిలీపై రానున్నారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న గోవిందుస్వామి మహేశ్వరం ఎస్వోటీకి బదిలీ కాగా పలు పీఎస్‌ల నుంచి మీర్‌పేట్‌కు నలుగురిని బదిలీ చేస్తూ రాచకొండ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. బొమ్మలరామారాం పీఎస్ నుంచి జీ.శ్రీనివాస్‌రెడ్డి, సీసీఆర్ఎంటీ నుంచి డీ.రాంబాబు, ఎల్బీనగర్ ఎస్వోటీ నుంచి ఎ.ఎ.రాజు, కీసర పీఎస్ నుంచి మిట్ట రాజశేఖర్ మీర్‌పేట్‌కు బదిలీ అయ్యారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు: కార్పొరేటర్



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మోహన్‌నగర్ బస్తీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన బస్తీలో పర్యటించారు. తరచూ డ్రైనేజీ, వరదనీటి సమస్యలు తలెత్తుతున్నాయని బస్తీవాసులు ఆయనకు విన్నవించారు. జలమండలి అధికారులు, జీహెచ్ఎంసీ ఈఈ శ్రీనివాస్, ఏఈ మాతృనాయక్‌లతో కలిసి ఆయన సమస్యను పరిశీలించారు. మ్యాన్‌హోల్‌కు అనుసంధానం చేసిన పాత పైప్‌లతో పాటు 33 కేవీ భూగర్భ విద్యుత్ పైప్‌లైన్లు ఉన్నాయని, దీంతో సమస్య జటిలమవుతోందని అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం సిబ్బంది మ్యాన్‌హోల్ వద్ద మట్టిని, మురుగు నీటిని తొలగించారు.

డ్రైనేజీ మురుగుతో కంపుకొడుతున్న నాలా

- ఔటర్ జంక్షన్ వద్ద వర్షం నీటి నాలాలోకి సంపూర్ణ హోటల్ డ్రైనేజీ
- హోటల్ పక్కనే భారీ మడుగు.. పందులు, కుక్కలకు ఆవాసంగా ప్రాంతం
- పట్టించుకోని మున్సిపల్ శానిటేషన్ విభాగం అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు పెద్దఅంబర్‌పేట్ ఔటర్ జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డులోని వర్షం నీటి కోసం ఏర్పాటు చేసిన నాలా డ్రైనేజీ మురుగుతో కంపు కొడుతుంది. నాలా పక్కనే ఉన్న ఓ హోటల్ నిర్వాహకులు అందులోని డ్రైనేజీ మురుగుతో పాటు కిచెన్ వ్యర్థాలను నేరుగా ఔటర్ రోడ్డులోని నాలాలోకి వదిలేస్తున్నారు. దీంతో అక్కడ పెద్ద మడుగు ఏర్పడింది. ఆ ప్రాంతం దుర్వాసనతో కంపు కడుతోంది. మడుగు పందులు, కుక్కలకు ఆవాసంగా మారింది. నిత్యం పదుల సంఖ్యలో పందులు, కుక్కలు అందులో పొర్లుతూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. దీంతో పాటు అటు వైపు వెళ్లిన పాదచారులపై దాడిచేసి గాయపరుస్తున్నాయి.



హోటల్ నుంచి వస్తున్న డ్రైనేజీ మురుగు సర్వీసు రోడ్డు నాలాలో కలిసి.. అక్కడ ఏర్పడిన మడుగు

భరించలేని దుర్వాసన..

పెద్దఅంబర్‌పేట్ ఔటర్ జంక్షన్ వద్ద విజయవాడ జాతీయ రహదారి నుంచి బలిజగూడ వైపు వెళ్లే సర్వీసు రోడ్డు పక్కనే కొంత కాలంగా సంపూర్ణ హోటల్ కొనసాగుతుంది. అయితే ఆ భవనానికి ఎలాంటి డ్రైనేజీ ఔట్‌లైన్ సౌకర్యం లేదు. దీంతో హోటల్‌లోని డ్రైనేజీతో పాటు కిచెన్ వ్యర్థాలను రోడ్డుపైకి వదిలేస్తున్నారు. అటు సర్వీసు రోడ్డులో వెళ్లే వాహనదారులతో పాటు జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు మడుగు నుంచి వస్తున్న దుర్వాసనను భరించలేకపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఇక్కడ పెద్దఅంబర్‌పేట్ శానిటేషన్ విభాగం అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్రైనేజీ మురుగును నేరుగా రోడ్డుపై వదిలేస్తున్నా శానిటేషన్ విభాగం అధికారులు చూసి చూడనట్లుగా వదిలేయడంపై స్థానికులతో పాటు వాహనదారులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ శానిటేషన్ అధికారులు నాలాలోకి డ్రైనేజీ మురుగును వదిలేస్తున్న హోటల్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే పోలీసుల లక్ష్యం

- మాదక ద్రవ్యాల స్మగ్లర్లపై ఉక్కుపాదం
- డ్రగ్స్ వ్యతిరేక ప్రచార పోస్టర్ ఆవిష్కరించిన రాచకొండ సీపీ

హైదరాబాద్ సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా పోలీసులు పని చేస్తున్నారని, మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతామని రాచకొండ సీపీ తరుణ్‌జోషి పేర్కొన్నారు. ప్రతి ఏటా జూన్-26న నిర్వహిస్తున్న అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని రాచకొండ కమిషనరేట్‌లో మత్తు పదార్థాల వ్యతిరేక ప్రచార పోస్టర్లను సీపీ తరుణ్‌జోషి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌మాయలో పడి తమ శక్తి యుక్తులను వృథా చేసుకోకూడదన్నారు. ఒక్కసారి డ్రగ్స్‌కు అలవాటైతే.. మెల్లమెల్లగా వ్యసనంగా మారే ప్రమాదం ఉందన్నారు. డ్రగ్స్ మీద పోలీసులు చేస్తున్న పోరాటంలో యువత పాలుపంచుకోవాలని, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండడంతో పాటు, తమ దృష్టికి వచ్చే నిషేధిత డ్రగ్స్ సరఫరా, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని తక్షణమే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం పోలీస్‌శాఖ, యువత, సమాజంలోని అన్ని వర్గాలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వినియోగం, దుష్ప్రభావాల గురించి యువతకు పరిజ్ఞానం కల్పించేందుకు సోషల్ మీడియాతో పాటు కళాశాలల్లో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.



డ్రగ్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాచకొండ సీపీ తరుణ్‌జోషి

కులగణన చేసి రిజర్వేషన్లు పెంచాలి

- బీసీ మేధోమదన సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య

ఖైరతాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో బీసీ కులగణన చేసి రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన పెంచాలని, లేనట్లయితే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని బీసీ సంఘాలు హెచ్చరించాయి. ఎన్నికల కోడ్ ముగియగానే కులగణన చేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఆమేరకు పనులు ప్రారంభం చేయకపోవడంతో ప్రజలను చైతన్యపరచి ఉద్యమ బాట పట్టనున్నట్లు తెలిపారు. బుధవారం లక్డీకాపూల్ హోటల్ అశోకాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీసీ మేధావులతో మేధోమదన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని దృష్టిలో పెట్టుకుని దేశ వ్యాప్తంగా బీసీలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఆయన ఇచ్చిన మాటకు విరుద్ధంగా తెలంగాణ ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ మేధావులను చర్చలకు పిలిచి రిజర్వేషన్ల పెంపునకు మార్గదర్శకాలను విడుదల చేయాలని కోరారు. లేనట్లయితే అన్ని జిల్లాల్లో జేఏసీలను ఏర్పాటు చేసి జూలై 1 నుంచి అన్ని జిల్లాలకు బీసీ మేధావులతో బస్సు యాత్ర చేపడుతామని తెలిపారు. అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు, బాసర నుంచి భాగ్యనగర్ వరకు బహిరంగ సభలు నిర్వహించి బీసీలను చైతన్యవంతులను చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ అనంతరం ప్రభుత్వం స్పందించకపోతే తెలంగాణ బంద్ నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు బీసీలకు జరుగుతున్న అన్యాయంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టేందుకు కేవలం 15 రోజులు సరిపోతుందని, తరువాత ఏ ఎన్నికలైనా జరపాలని అన్నారు. సదస్సులో ప్రొఫెసర్లు సింహాద్రి, తిరుమల, బీసీ సంఘాల నేతలు వీజీఆర్ నారగోని, గణేష్‌చారి, సురేష్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్‌గౌడ్, బీసీ మేధావులు సుంకర సత్యనారాయణ, ప్రొఫెసర్ వినయ్‌బాబు, ప్రొఫెసర్ వెంకట్రామయ్య, సమ్మయ్య, వేణుమాధవ్, కుల్కచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల ఆగడాలను ఆపాలి

హయత్‌నగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం హయత్‌నగర్ మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలల ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఆయా పాఠశాలల్లో నోట్సు, పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, షూలు, యూనిఫాంలు విక్రయిస్తున్నారంటూ కాకతీయ, గౌతమి, పాఠశాలల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు పీ. శివకుమార్, గ్యార క్రాంతి మాట్లాడుతూ పాఠశాలల్లో నోట్సు, పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, షూలు, యూనిఫాంలు విక్రయించవద్దని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేసినా ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలు ఈ నిబంధనలను పాటించకుండా యథేచ్ఛగా విక్రయాలు జరిపి విద్యను వ్యాపారంగా మలుస్తున్నారని ఆరోపించారు. ఇష్టం ఉన్నంత రేటు పెట్టి విక్రయాలు జరుపుతున్నారని అన్నారు. అనుమతిలేని భవనాలలో పాఠశాలలను నడిపిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. మూడు, నాలుగవ తరగతి విద్యార్థులకు సుమారు రూ.84వేల ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సామిడి వంశీధర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, వెంకటేశ్, బన్నీ, భాను, లక్ష్మణ్, గణేష్, భరత్, నాగరాజు, ఉపేందర్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

హయత్‌నగర్‌లోని ఏవీఎస్ స్కూల్‌కు సీబీఎస్ఈ అనుమతి లేకుండానే నిర్వహిస్తున్నారంటూ బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు ఏవీఎస్ పాఠశాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ ఏవీఎస్ పాఠశాల స్టేట్ అనుమతి తీసుకుని సీబీఎస్ఈ అనుమతి ఉందంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు స్టాలిన్, అరుణ్, వంశీ, సాయి, సిద్ధూ పాల్గొన్నారు.



హయత్‌నగర్‌లో కాకతీయ పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

లా చేసిన విద్యార్థులకు ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): లా పూర్తి చేసిన బీసీ విద్యార్థులు మూడేళ్లపాటు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.ఆశన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ జిల్లాకు చెందిన అర్హులైన బీసీ అభ్యర్థులు జూలై 4 వరకు లక్డీకపూల్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, స్ఫూర్తి భవన్ 4వ అంతస్తులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు వివరాలతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులు జతచేయాలని సూచించారు. అభ్యర్థులు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్‌చే గుర్తింపబడిన విద్యాసంస్థ నుంచి లా కోర్సులో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించరాదని, బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకొని ఉండాలన్నారు.

రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

- హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్

చాదర్‌ఘాట్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసి ఆర్థిక భారంతో విద్యకు దూరమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విద్యార్థులకు విద్య అందేలా చర్యలు చేపట్టాలని కోరుతూ హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మలక్‌పేట కళ్యాణ్‌నగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేటు విద్యాసంస్థల్లో పేద, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు 25శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని న్యాయవాది డిమాండ్ చేశారు. వీటిపై ప్రభుత్వం స్పందించకపోతే న్యాయపోరాటం చేస్తామని ప్రకటించారు.



మాట్లాడుతున్న న్యాయవాది రాపోలు భాస్కర్

జల్సాలకు అలవాటుపడి చోరీలు

- హ్యాండిల్ లాక్ లేని బైకులే టార్గెట్
- పోలీసులకు దొరికిన నలుగురు దొంగలు

తాండూరు రూరల్, జూన్ 19 : జల్సాలకు అలవాటు పడిన నలుగురు యువకులు బైకుల చోరీని ఎంచుకున్నారు. హ్యాండిల్ లాక్‌లేని బైకులే లక్ష్యం చేసుకుని దొంగతనం చేశారు. వీరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ కాశీనాథ్‌లతో కలిసి బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. తాండూరు పట్టణంలోని గ్రీన్ సిటీకాలనీకి చెందిన అడిగొల్ల వంశీకృష్ణగౌడ్, అలియాస్ అభినందన్(20), తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన బొడ్డె జస్వంత్ అలియాస్ జానీలు మరో ఇద్దరు మైనర్లతో కలిసి జల్సాల కోసం బైకుల చోరీకి పాల్పడ్డారు. 20రోజుల క్రితం హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో రెండు పల్సర్ బైకులు, 15రోజుల క్రితం యాలాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా వద్ద హీరో హోండా స్ప్లెండర్, మిత్రానగర్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్, పది రోజుల క్రితం వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకులను చోరీ చేశారు. చోరీ చేసిన బైకులను వారి వారి ఇళ్ల వద్ద ఉంచుకున్నారు.

ఇలా దొరికారు..

తాండూరు పట్టణం ఇందిరాచౌరస్తా సమీపంలోని మినార్ టీ పాయింట్ వద్ద సోమవారం మధ్యాహ్నం తన బైకు పోయిందని బంటారం మండలం కల్‌కుంద గ్రామానికి చెందిన బోయిని సత్యనారాయణ తాండూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పట్టణ ఎస్ఐ కాశీనాథ్ విలియంమూన్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నారు. ఇంతలో అక్కడికి బైకుతో వచ్చిన వంశీకృష్ణగౌడ్, జస్వంత్‌లను బైకు కాగితాలు అడగగా, చూపించలేకపోయారు. దీంతో వారిని విచారించగా, చౌరస్తాలో బైకు దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని మరింత విచారించగా, ఐదు బైకులను దొంగిలించినట్లు డీఎస్పీ తెలిపారు. అయితే హ్యాండిల్ లాక్‌లేని బైకులను మాత్రమే చోరీ చేసినట్లు విచారణలో తేలింది. నిందితులు దొంగలించిన ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. అయితే నలుగురు నిందితుల్లో ఇద్దరు మైనర్లు ఉండగా, వారిని జువెనైల్ హోంకు తరలిస్తామని చెప్పారు. వంశీకృష్ణగౌడ్, జస్వంత్‌లను రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు. కేసు ఛేదించిన ఎస్ఐ కాశీనాథ్ రాములు, హెడ్‌కానిస్టేబుళ్లు రామకృష్ణ, అంజద్, కానిస్టేబుళ్లను అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

జోన్ బృందం: ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మీర్‌పేట్ చౌరస్తాలో నిర్వహించిన వేడుకల్లో మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కేక్ కట్ చేశారు. నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథాశ్రమంలోని అభాగ్యులకు మేయర్ పారిజాతానర్సింహారెడ్డి దంపతులు అన్నదానం నిర్వహించారు. కొత్తపేట భరత్‌నగర్‌లో రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పండ్లు, నోటుబుక్కులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మీర్‌పేట్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే తీగలతో కలిసి కేక్ కట్ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా

నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలు

- ఫిర్యాదుతో విద్యాశాఖ అధికారుల చర్యలు

సైదాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో యూనిఫాంలు, పుస్తకాలు విక్రయిస్తున్న సైదాబాద్ జయనగర్‌లోని సెయింట్ ఆండ్రూస్ స్కూల్‌పై బుధవారం మండల విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టారు. స్కూల్‌లో జరుగుతున్న అమ్మకాలపై విద్యార్థుల తల్లిదండ్రులు మండల ఉపవిద్యాశాధికారి రాధాకృష్ణకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించి పాఠశాలకు చేరుకున్న అధికారులు పరిశీలించారు. పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్న గదికి తాళం వేసి సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో సైదాబాద్ మండలం విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, సిబ్బంది నర్సింగ్ రావు, రాజు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా ఇస్మాయిల్

ఎల్బీనగర్: కాంగ్రెస్ కమిటీ రంగారెడ్డి జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన సయ్యద్ ఇస్మాయిల్ నియమితులయ్యారు. పీసీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ బుధవారం నియామక ఉత్తర్వులను ఇస్మాయిల్‌కు అందజేశారు. జితేందర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బడుగు, బలహీనవర్గాల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందేవిధంగా కృషి చేయాలని సూచించారు. ఇస్మాయిల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగపర్చుకునేలా ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మిద్దెల జితేందర్, సీఎం రేవంత్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నల్సార్‌లో ఇద్దరు విశిష్ట ప్రొఫెసర్ల నియామకం

- గోపాలకృష్ణగాంధీ, సాయినాథ్ ఎంపిక



సాయినాథ్



గోపాలకృష్ణగాంధీ

శామీర్‌పేట : మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్సిటీ విశిష్ట ప్రొఫెసర్లుగా మాజీ గవర్నర్, దౌత్యవేత్త గోపాలకృష్ణ గాంధీ, ప్రముఖ పాత్రికేయుడు, మెగాసెసే అవార్డు గ్రహీత సాయినాథ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నల్సార్ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ కృష్ణదేవరావు మాట్లాడుతూ విశిష్ట ప్రొఫెసర్ అనే పదవికి ప్రజాక్షేత్రంలో అత్యంత గొప్పసేవ చేస్తున్న మేధావులను గుర్తించి, నల్సార్ విశ్వవిద్యాలయంలో విద్యాపరంగా వారి సేవలను వినియోగించుకోనున్నట్లు తెలిపారు. న్యాయ విద్య పరిధిని విస్తృతం చేసి, లావిద్యార్థులకు, న్యాయ భావన జస్టిస్‌కు అనేక ప్రధాన ప్రశ్నలను పరిచయం చేయాలని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆ దిశగా ఈ మేధావులను విశిష్ట ప్రొఫెసర్లుగా నియమించి ఒక ముందడుగు వేసినట్లు వివరించారు. ప్రజాక్షేత్రంలో మేధావుల బోధనల ద్వారా చట్టమనేది కేవలం సాంకేతిక విషయంపై అధ్యయనం మాత్రమే కాదని, విద్యార్థులకు సామాజిక, ఆర్థిక న్యాయానికి లోతైన ప్రశ్నలను, అంశాలను అందించడం అవసరమని ఆయన వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు, చట్టానికి, సామాజిక ఆర్థిక న్యాయానికి మధ్య ఉండే సంబంధాన్ని ఈ మేధావులు వివరిస్తారని ఆయన తెలిపారు.

కాఫీ కథను తెలియజేసిన 'క్రాఫ్టింగ్ కాఫీ కల్చర్'



కాఫీ సువాసనలను ఆస్వాదిస్తున్న చాందిని

హైదరాబాద్ సిటీ: తోట నుంచి కప్పులోకి చేరే వరకు కాఫీకి ఉన్న ప్రయాణ కథను తెలియజేసేలా మాదాపూర్‌లోని ద కోరమ్‌లో బుధవారం క్రాఫ్టింగ్ కాఫీ కల్చర్ పేరిట ఓ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫస్ట్ క్రాక్ స్పెషాలిటీ రోస్టర్స్ సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాఫీ ప్రియులు, సాగుదారులు, కేఫ్ యజమానులు, స్పెషాలిటీ కాఫీ కమ్యూనిటీకి చెందిన నిపుణులందరినీ ఒకేచోటకు చేర్చి స్పెషాలిటీ కాఫీలను చర్చించింది. రత్నగిరి ఎస్టేట్ నుంచి తీసుకువచ్చిన స్పెషాలిటీ కాఫీలను ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన చర్చా కార్యక్రమంలో రత్నగిరి ఇంటర్నేషనల్ మేనేజింగ్ పార్ట్‌నర్ అశోక్ పాత్రే మాట్లాడుతూ హై-గ్రేడ్ స్పెషాలిటీ ఇండియన్ కాఫీని పండించడంలోని సవాళ్లు, కాఫీ ప్రాముఖ్యతను వివరించారు. చాందిని ఎస్అరోకె మాట్లాడుతూ కాఫీ రైతులు, వినియోగదారుల మధ్య అంతరాన్ని తగ్గించడమే తమ లక్ష్యమని అన్నారు.

జేఎన్‌టీయూలో బీ ఫార్మసీ కోర్సు

ఈ ఏడాది నుంచే ప్రవేశాలకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్ సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీలో ఈ విద్యా సంవత్సరం (2024-25) కొత్తగా బీ ఫార్మసీ కోర్సును ప్రారంభించేందుకు అనుమతిస్తూ రిజిస్ట్రార్ డా. కే వెంకటేశ్వరరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజనీరింగ్ కాలేజీలోని సెంటర్ ఫర్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ప్రస్తుతం ఎం ఫార్మసీ కోర్సులు నడుస్తుండగా, ఈ ఏడాది నుంచి 60 సీట్లతో బీ ఫార్మసీ కోర్సు ప్రవేశపెట్టాలని సదరు విభాగాధిపతి ప్రతిపాదించారని, ఆ ప్రతిపాదనలకు ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ ఆమోదం తెలిపినట్లుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా కొత్తగా అనుమతించిన బీ ఫార్మసీ కోర్సు 60 సీట్లలో 30 సీట్లు రెగ్యులర్ కేటగిరీ, మరో 30 సీట్లు సెల్ఫ్‌ఫైనాన్స్ కేటగిరి కింద విభజించారు.